యున్నాడు, గ్రంథములకు అగ్ని, శైథిల్యము, స్థానచలనము, చౌర్యమునను నాలుగాపదలుండునని తెనాలి రామకృష్ణకవి తన పాండురంగమహాత్మ్యమున చెప్పియున్నాడు. తామ్ర శిలాశాసనములలో కడపటి భాగమున దాత తానొనర్చిన ధర్మమును రక్షింపవలెనని వేడినట్లే, పూర్వులు తాము కష్టపడి వ్రాసిన గ్రంథముల చివరుభాగమున భావిపాఠకుల నుద్దేశించి 'ఓయీ! నడుమును కాళ్ళునులాగ, మెడలుపడిపోయి కండ్లు నుండునట్లుగా నేను కష్టపడివ్రాసిన యీ గ్రంథమును జాగ్రతగా రక్షింపుము' అని హెచ్చరించియున్నారు. ఇట్లు తీరికవేళలో మనపూర్వులు వ్రాసిన గ్రంథము లెన్నియో నేటికిని పల్లెలలో గాంచనగుచున్నవి.

ప్రాచీనకాలమునుండి నేటివరకును నిలచియున్న వ్యక్తికగ్రంథాలయములు ఉత్కృష్టములగు నిదర్శనములు కొన్నిగలవు. మైసూరు ప్రభుత్వమువారి ఆర్క శాఖోద్యోగియగు పద్మరాజ పండితునియింట నాయన పూర్వులు సేకరించినవియు, నాయన చెన్నపురి రాజధానిలోను, సింహాతమునను సంపాదించినవియునగు ప్రాచీనగ్రంథము లెన్నియో యున్నవి. మైసూరు రాజ్యములోని జైనపండితులవద్ద చక్కని భాండారము లున్నవి. మైసూరులోని వీరసంగప్ప, కరిబసవశాస్త్రి, మల్లప్ప యనువారివద్దను, దేవనగరెలోని హుబవీరప్ప యనువారివద్దను ప్రాచీనవీరశైవ గ్రంథము లెన్నియో పదిలపరుపబడియున్నవి. అట్లే మైసూరు రాజబంధువులగు దళవాయి దేవరాజఉర్సు, నంజరాజ బహదూర్, లింగరాజఉర్సు అనువారును చక్కని ప్రాచీన గ్రంథాగారముల కధిపతులైయున్నారు.

—మారేమండ రామారావు ఎం.ఏ బిఇడి.

# అద్దాల్లో బిడ్డలు

అభంశుభం ఎరగని అద్దాల్లో బిడ్డలఅచ్చట్లు ముచ్చట్లు అమితానందాన్ని, ఆపాదిస్తాయి అనడం ఆక్షేపణీయమైన అంశముకాదు.

అప్పుడూ, ఇప్పుడూ అనకుండా ఎప్పుడూ, ఆడేమాటకి, పాడే పాటకి, చేసే చేతకి, సాగేనడకకి, ఒహటేమిటి అన్నింటికి అడ్డం తగిలే యీ అమాయిక హృదయాల చర్యలకి, అదరిద్దామన్నా, ఆధారం కనబడదు.

అంతలో మితిమీరిన ఆనందం—అంతలోనే అంతులేని దుఃఖము—మరి కాస్తలోనే తీరని పట్టుదల—అంతలోనే రాజీ. యిన్ని అందచందాలుగల భావాలు, అప్పటికప్పుడు, ఆకూనలకే అనుకూలపడాలి కాని, అద్దంముందు అనుకున్నంతసేపూ నిలబడి, అమర్చుకోడానికి ఎన్నిపాట్లు పడ్డా ఏమీ అతకవు ఎంతవాళ్ళకైనా.

శరీర మార్దవం—వచ్చీరాని మాటల మృదుత్వం—తెలిసీ తెలియని చేతల చురుకు—ఆటల ఆనందం. అన్నింటికంటె మించిన సహజమైన అనుకరణశక్తి, ఓదాని కింకొకటి సాయపడుతూ, అందాన్ని కూరుస్తాయి: దాని అనుభవంలేని జీవులు దురదృష్టవంతులని చెప్తారు పెద్దలు. పైగా నాగరికత—దానితో మూర్ఖత్వం—దానితో అహంభావం ఏకమయి మూలనున్న, ఉపయోగంలేని కుక్కిమంచం కోడులోకూడా, బలవంతంగా, దూరుతూన్న యీదినాల్లో ఆ ఆనందం మన ప్రయత్నంలేకుండానే మాసిపోయి మచ్చుకి మందులోకయినా దుర్లభమైపోతూంది కాని విచిత్రభావనా కల్పనాలు ఆసాధుజీవులలో మాత్రం గైగు హోజరు కావడంలేదు కారణం ఏమిటంటే ప్రపంచవాసనలు వాళ్లని యింకా ఆవరించవు.

* * *

మాశాస్త్రిల్లు ఒక్కడే కూర్చున్నాడు అరుగుమీద, చిట్టిపాదాలు క్రిందకిచాచి,

ఆడింపుకుంటూ, ఆనందిస్తూ. లేతనవ్వు తొంగలిస్తూంది. చిన్న ముంగురులు, గాలిలో కెరటాలు కొడుతున్నాయి. అరుగుకింద వాళ్ళ తువ్వాయి పరకలు కొరుకుతూంది. నమిలేదప్పుడల్లా మూతితో శాస్త్రిల్లు పాదాల్ని తాకుతూంది నేస్తం కలుపుకోడానికి కాబోలు. గట్టిమూపులతో దాన్ని బిగ్గా కట్టేస్తున్నాడు తనపాదాలకి దాని మూతి తగిలినప్పుడల్లా ఇట్టే పైకిలాక్కుంటున్నాడు. మళ్ళీ సమయంకొద్దీ క్రిందకి జారవిడుస్తున్నాడు, చికిలుస్తూ, దాని జతఉండడానికి అంగీకరిస్తున్నట్టుగా.

* * *

"శాస్త్రిల్లూ! తలకిచమురురాస్తాను, రా! నాయనా"

"మ్మా! తువ్వ........ఊ... ..."

"తువ్వాలేదు గివ్వాలేదు, రా! నాయనా! నూనిరాసి వెళ్లాలి"

"అద్దు...."

"ఏడిశావ్. వెధవ పెంకితనం నువ్వూను - వస్తావా ? రావా ?"

"ఆను ... పో." చేతులు తిప్పుతున్నాడు-చిరాకు మొఖంలో కనబడుతూంది.

"బిస్కట్టు యిస్తారా - మానాయన రావోయ్—రా, బాబూ!"

"అక్కర్లే ..."

"డబ్బివ్వనా ?"

"ఊ ... ..."

"బంతి యిదుగో - రా"

"........"

"తాయిలం యింద...."

"......" శాస్త్రిల్లు గొల్లుమన్నాడు. కాళ్లా, వేళ్లా నిలబడకుండా :

* * *

"ఎందుకు వాణ్ణి అలా ఏడిపించడం ?"

"వెలిడున్నాడో లేదో ; చూడండి ! యింత పిసరుమాట చెవికెక్కించుకోడు— వెధవపెంకితనం వీడున్నూ."

"వాడు నీమాట చెవికెక్కించుకో లేకని నీమొహం ముడుచుకున్నావుకాని, వాడు చేసేపని నీకళ్ళకి ఏమైనా కట్టినట్టు అనుమానం ఉందా ?"

"ఆ....ఆయనా, మీరూ, చేసేపనులు చూస్తూ కూర్చుంటే,కడుపు నిండిపోతుంది"

"అంతే - ముద్దూ ముచ్చటా ఎరగని మొద్దు మొహాల మూర్ఖత్వం యిలాగే ఉంటుంది - తోచదు-చెపితే తలకెక్కదు సుఖంగా ఆడుకుంటూన్నవాణ్ణి యిట్టే 'అలో' మని పించావు వాడి సంతోషాన్ని చంపి !"

"నాన్నా!....ఉ ...అమ్మ ... తూడు— తువ్వ...."

నాకూడా గిర్రునతిరిగాయి నీళ్లు కళ్ళల్లోంచి-చేతుల్లోకి తీసుకున్నాను శాస్త్రిల్లుని

"అమ్మ - కొత్తి ...తువ్వ"

శాస్త్రిల్లుని ఓదార్చాను-తల్లి కేసిచూచి, ముత్యాలు కారుతూన్న కళ్లతో, సగం చూపు చూస్తూ 'హాంయ్' అని చెయ్యి విసిరాడు తల్లి కేసి.

"ఓస్, అబ్బా ! ఏంపౌరుషం" * * *

చంకలు బాదుకుంటూ, కిచకిచమంటూ "అమ్మా!....తువ్వ" గిన్నెలోని బువ్వను చూపుతూ తల్లి "తువ్వాయి బువ్వ తింటూంది నువ్వుకూడా 'అమ్మ' తిను ; నాయనా !

"అమ్మా - తువ్వ ...బువ్వ" అంటూ పరకలు దూడకి అందిస్తున్నాడు శాస్త్రిలు

తువ్వా, తనూ, బువ్వతిన్నారు, అమ్మా తనూ రాజీపడి. నేనూ ఆవిడా నవ్వుకున్నాము.

—కడియాల కామేశ్వరరావు